విశాలాంధ్ర గోదావరి జిల్లా
కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

ప్రభుత్వాసుపత్రిలో దోపిడీ నియంత్రించాలి
-ఏఐటీయూసీ, సీపీఐ డిమాండ్

విశాలాంధ్ర - కాకినాడ : ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో నిలువు దోపిడిని అరికట్టి అధిక ధరలు నియంత్రించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, సిపిఐ జిల్లా కార్యదర్శి కామిరెడ్డి బోడకొండ డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో బడ్డీ కొట్టుల వ్యాపారస్తులను అధిక ధరలపై విచారించగా అన్ని వస్తువులపై సగానికి సగం అధిక ధరలు వసూలు చేస్తున్నారని వారు అన్నారు. ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఉన్నప్పుడు ఇటు పశ్చిమగోదావరి అటు విశాఖ రోజుకు సుమారు మూడు వేలకు పైనే హాస్పటల్‌కు వైద్యం చేయించుకొనుటకు వస్తూ ఉండేవారని, ఇప్పుడు ఇంకా ఎక్కువగానే వస్తున్నారని తెలిపారు. అలాంటి వారందరికీ ప్రభుత్వం పూర్తిగా ఉచితంగా వైద్య సదుపాయంతో పాటు మందులు పంపిణీ చేస్తుందని, అలాంటిది బడ్డీ కొట్టు నిర్వాహకులు బయట దొరికే ప్రతి వస్తువు పైన సగానికి సగం పైనే అధిక ధరలు వసూలు చేస్తున్నారని తెలిపారు. భోజనాలు చేసే ప్లేట్ రెండు రూపాయలు అయితే నాలుగు రూపాయలకు అమ్ముతున్నారని, 5 రూపాయలు విలువ చేసే యురిన్ డబ్బా 10 రూపాయలకు అమ్ముతున్నారని, 5 రూపాయలు సబ్బును పది రూపాయలకు అమ్ముతున్నారని పేర్కొన్నారు. దీనిపై ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని నిలువు దోపిడీని అరికట్టి అధిక ధరలు నియంత్రించాలని ప్రసాద్, బోడకొండ డిమాండ్ చేశారు.

జమున మృతికి సంతాపం

విశాలాంధ్ర - కాకినాడ : రంగస్థలం, సినీనటి జమున మృతికి ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి నివాళులర్పించింది. ప్రజా కళాతపస్వి డాక్టర్ గరికపాటి రాజారావు మాభూమి నాటకం ద్వారా జమునని నాటక రంగానికి పరిచయం చేశాడు. తర్వాత కాలంలో డాక్టర్ గరికిపాటి రాజారావు దర్శకత్వంలో అనేక నాటికలు నాటకాలు ప్రదర్శించింది. రాజా తన స్వయ దర్శకత్వంలో పుట్టిల్లు అనే సినిమా ద్వారా సినిమా రంగానికిగా జమునను పరిచయం చేశాడు. ఆ తర్వాత కాలంలో జమున చలనచిత్ర రంగంలో అనేక చిత్రాల్లో నటించి ప్రజా మన్ననలతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పురస్కారాలు అందజేశాయి. జమున మృతికి రాష్ట్ర సీనియర్ నాయకులు డాక్టర్ చెలికాని స్టాలిన్, ప్రజా నాట్యమండలి నాయకులు బొడ్డు బుల్లబ్బాయ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మహంతి లక్ష్మణరావు, రాష్ట్ర మీడియా సెల్ కన్వీనర్ ముప్పై కుమారస్వామి, వి. శ్యామ్యూల్ సంతాపం తెలియజేశారు.

రజక సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

విశాలాంధ్ర - మామిడికుదురు : మామిడికుదురు మండలం రజక సంఘం నూతన అధ్యక్షుడిగా కోటిపల్లి సాయిబాబు ఏకగ్రీంగా ఎన్నిక అయ్యారు. మాజీ మండల అధ్యక్షులు నగరపు సుబ్రమణ్యేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రజక సంఘాల సభ్యులు హాజరై మండల

ప్రెసిడెంట్, సెక్రటరీ, వైస్ ప్రెసిడెంట్, ట్రెజరర్ కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడుగా కోటిపల్లి సాయిబాబు, వైస్ ప్రెసిడెంట్‌గా గుడిమెళ్ళంక కాశీ, సెక్రటరీగా పసుపులేటి వెంకట కుమార్, ట్రెజరర్ గా పసుపులేటి ధర్మయ్య, కమిటీ సభ్యులుగా నేదునూరి రాజ్ కుమార్, ముంగడ శివ కుమార్, గన్నవరపు సుబ్రహ్మణ్యం, తాటిపాక సుబ్రహ్మణ్యం లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన మండల శాఖ సంఘ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షిస్తూ పలువురు అభినందనలు తెలియజేశారు.

డాక్టర్ చంద్రశేఖర్‌కు జనసేన అభినందన

విశాలాంధ్ర - కాకినాడ రూరల్ : కాకినాడ రూరల్ వాస్తవ్యులు శంకురాత్రి ఫౌండేషన్ అధినేత, కిరణ్ కంటి ఆసుపత్రి వ్యవస్థాపకులు డాక్టర్ చంద్రశేఖర్ చేస్తున్న సేవలకు మెచ్చి ఎంతో ప్రతిష్టాత్మక మైన, అత్యున్నతమైన పద్మశ్రీ బిరుదును డాక్టర్ చంద్రశేఖర్‌కి భారత

ప్రభుత్వం ఇవ్వడం ఈ ప్రాంత వాసిగా ఎంతో గర్వపడుతున్నామని, జనసేన పార్టీ పిఎసి సభ్యులు కాకినాడ రూరల్, సిటీ ఇన్‌చార్జి పంతం నానాజీ, ముత్తా శశిధర్ అన్నారు. కాకినాడ రూరల్ జనసేన నాయకులు, జనసైనికులతో కలిసి డాక్టర్ చంద్రశేఖర్‌కు గజమాల వేసి దుశ్శాలువాలతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ స్థాయి నాయకులు, జనసైనికులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

విద్యార్థులకు పెన్నుల పంపిణీ

విశాలాంధ్ర - మండపేట : కేంద్ర ప్రభుత్వం 2018లో ప్రారంభించిన పరీక్షా పేపర్‌పై చర్చ కార్యక్రమంలో భాగంగా మండపేట వేగుళ్ల సూర్యారావు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు పవర్ ప్రెజెంటేషన్ ద్వారా విద్యార్థులకు

చూపించారు. శుక్రవారం కోనసీమ జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు పార్టీ కార్యకర్తలతో పాఠశాలను సందర్శించి ప్రధాని నరేంద్ర మోడీ ప్రత్యక్ష ప్రసారాన్ని విద్యార్థులతో కలిసి వీక్షించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కోన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు పరీక్షల్లో ప్రశాంతంగా ఉంటూ పరీక్షలు రాయగలిగితే ప్రతి ఒక్కరూ విజయం సాధిస్తారని అన్నారు. ప్రతీ విద్యార్థి చదువుల్లో రాణించి ఉన్నత శిఖరాలకు వెళ్ళాలన్నదే మోడీ ఆకాంక్ష అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు చుక్కల అప్పారావు, వెత్సా దుర్గాప్రసాద్, తణుకు నరసింహమూర్తి, యువమోర్చ పట్టణ అధ్యక్షులు బుద్దవరపు రాజు తదితరులు పాల్గొన్నారు.

తోట త్రిమూర్తులును మర్యాద పూర్వకంగా కలిసిన అలీఖాన్ బాబా

విశాలాంధ్ర - మండపేట : షేక్ అండ్ షేక్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పట్టణానికి చెందిన షేక్ అలీఖాన్ బాబా రెండో సారి నియమితులైన సంద ర్భంగా ఆయన

ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులును మర్యాద పూర్వకంగా కలిశారు. శుక్రవారం విజయలక్ష్మి నగర్లో ఉన్న వైఎస్సార్సీపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ తోటను కలిసి జ్ఞాపికను అందజేశారు. అలివేలు మంగ తాయరు వేంకటేశ్వర స్వామి వార్ల చిత్ర పటాన్ని ఆయనకు అందజేసారు. ఈ సందర్భంగా బాబా మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ కు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు కృతజ్ఞతలు తెలిపారు. నూతనంగా పదవిని అలంకరించిన కార్పొరేషన్ ఛైర్మన్ కు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. సీఎం జగన్ ప్రభుత్వంలో ముస్లిం మైనారిటీలు సంతోషంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ మీగడ శ్రీనివాస్, ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్, వైసీపీ టౌన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

యువగళం పాదయాత్రలో ఆదిరెడ్డి వాసు

విశాలాంధ్ర బ్యూరో - రాజమహేంద్రవరం : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కుప్పం నుంచి యువగళం నినాదంతో చేపట్టిన పాదయాత్రకు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి వాసు లోకేష్ అడుగులో అడుగు వేసుకుంటూ ఆయనతో పాటు మొదటి రోజు

పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ తమ భవిష్యత్తు నాయకుడైన లోకేష్ యువగళం పాదయాత్ర పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపుతుందన్నారు.

వైద్యాధికారికి పురస్కారం

విశాలాంధ్ర - చాగల్లు : చాగల్లు మండలంలోని కలవలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడంలో ముందున్నంతకుగాను వైద్యాధికారి డాక్టర్ ఎం. సౌజన్యకు ఉత్తమ వైద్యాధికారి పురస్కారాన్ని అందజేశారు. ఈ పురస్కారం జనవరి 26వ తేదీ గురువారం జిల్లా కేంద్రమైన రాజమండ్రిలో గణతంత్ర దినోత్సవ సందర్భంగా కలెక్టర్ మాధవీ లత, జిల్లా వైద్యశాఖ అధికారి సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సౌజన్య సేవలను పలువురు కొనియాడారు. కలవలపల్లి గ్రామ నాయకులు పీహెచ్సీ సిబ్బంది పలువురు అభినందనలు తెలియజేశారు.

పేదల గృహాలకు పట్టాలివ్వండి

- జగనన్న ఇంటి నిర్మాణానికి ఐదు లక్షలు కేటాయించండి
- సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు
- 45 46 వార్డుల్లో పర్యటించిన సీపీఐ బృందం

విశాలాంధ్ర బ్యూరో - రాజమహేంద్రవరం : ఆనాడు ప్రతిపక్ష నేతగా ఉన్న వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో తాను అధికారంలోకి వస్తే ఎక్కడ పాకలు ఉంటాయో అక్కడ ఇళ్ల పట్టాలు ఇచ్చి ఇల్లు నిర్మిస్తానని చెప్పారని, రాజమండ్రిలో పలు ప్రాంతాలలో పాకలు వేసుకుని జీవిస్తున్న వారికి ఎంపీ భరత్ పట్టాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు డిమాండ్ చేసారు. శుక్రవారం స్థానిక 45, 46 వార్డులలో సిపిఐ నగర కమిటీ ఆధ్వర్యంలో బృందం పర్యటించింది. రాజీవ్ గాంధీ నగర్ వాసులు సుమారు 15 సంవత్సరాలుగా అక్కడే నివసిస్తున్నారని వారందరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వాలని అన్నారు. ఓటీఎస్ పేరుతో కొంతమంది మహిళల వద్ద నుండి డబ్బులు కట్టించుకున్నారని, వారికి ఇప్పటివరకు పట్టాలు ఇవ్వలేదని అన్నారు. సీపీఐ నగర కార్యదర్శి కార్య దర్శి వి. కొండలరావు మాట్లాడుతూ జగనన్న ఇంటి నిర్మాణానికి ఇస్తున్న లక్ష ఎనభై వేలు ఏ మాత్రం సరిపోవడం లేదని వెంటనే ఐదు లక్షలు పెంచాలని అయన డిమాండ్ చేశారు. ఈ పర్యటనలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆచంట సత్యనారాయణ. సునీల్. పార్టీ సీనియర్ నాయకులు యడ్ల లక్ష్మి, సేపేని రమణమ్మ , మహిళా నాయకురాలు సుజనమ్మ, కొండవాతి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ అధికారులు పనితీరు మార్చుకోకపోతే తీవ్ర చర్యలు

విశాలాంధ్ర-కొవ్వూరు: మున్సిపల్ అధికారులు పనితీరు మార్చుకోకపోతే తీవ్ర చర్యలు ఉంటాయని హోం మంత్రి తానేటి వనిత హెచ్చరించారు. కొవ్వూరు మున్సిపల్ సాధారణ, బడ్జెట్ సమావేశాలు మున్సిపల్ చైర్‌పర్సన్ రత్నకుమారి

అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన మంత్రి వనిత మాట్లాడుతూ మున్సిపల్ అధికారులపై అనేక అవినీతి ఆరోపణలు వస్తున్నాయని అవి తన దృష్టికి కూడా వచ్చాయని ఇప్పటికైనా అధికారులు తీరు మార్చుకోకపోతే చూస్తూ ఊరుకోబోనని హెచ్చరించారు. ముఖ్యంగా టౌన్ ప్లానింగ్ అధికారులపై పెద్ద ఎత్తున అవినీతి ఆరోపణలు వస్తున్నాయన్నారు. అధికార పార్టీ కౌన్సిలర్లు రమేష్, బత్తి నాగరాజులు సైతం అవినీతి ఆరోపణలను సమావేశం దృష్టికి తీసుకురావడం గమనార్హం. మున్సిపల్ కౌన్సిల్ ప్రతిపక్ష నాయకుడు మాజీ చైర్మన్ చిన్ని మాట్లాడుతూ పట్టణంలోని రోడ్లన్నీ అధ్వానంగా మారాయని సాక్షాత్తు మంత్రి ఇంటికి వెళ్లే దారిలోనే గోతులు సైతం పూడ్చ లేకపోయారని విమర్శించారు. జనరల్ ఫండ్స్ తో అభివృద్ధి పనులు చేయటం వల్ల మున్సిపాలిటీ ఆర్థిక పరిస్థితి దిగజారిందని అందువల్ల మంత్రి కలగజేసుకుని గ్రాంట్లు తేవాలని విజ్ఞప్తి చేశారు. బడ్జెట్ విషయానికి వస్తే తొమ్మిది కోట్ల16 లక్షలు గాను రాబడి ఖర్చు 7 కోట్ల 93 లక్షల 94000గా చూపించారు. మిగులు రాబడి ఒక కోటి 22 లక్షల 59 వేలుగా చూపించారు. ఈ నిధులను మూలధన నిధులకు మళ్లించినట్టు తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు

బస్సుయాత్ర జయప్రదం చేయండి

విశాలాంధ్ర-రాజమహేంద్రవరం: స్థానిక శ్యామల సెంటర్ వద్ద గల ప్రజా సంఘాల కార్యాలయం వద్ద సమావేశం జరిగింది . దీనిలో పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి ఎస్.కిరణ్‌కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎన్.రాజా,

ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సి.హెచ్.సునీల్, డివైఎఫ్ఐ నాయకుడు టి.రాజేష్ ,ఎన్.ఎస్.యు.ఐ తారకేశ్, టి.ఎన్.ఎస్.ఎఫ్ నాయకులు మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి కేంద్రప్రభుత్వం ప్రత్యేక హెూదా, విభజన హామీలు పార్లమెంట్ సాక్షి గా 2014 ఫిబ్రవరి 24 ను ప్రకటించి నమ్మించి, మోసం చేసారని అన్నారు. లక్షలాది మంది విద్యార్థులు , నిరుద్యోగులు భవిష్యతు ప్రత్యేక హెూదా , విభజన హామీలు మీద ఆధారపడి వుందని, నరేంద్ర మోడీ ఎన్నికల ప్రచారంలో సంవత్సరానికి 2 కోట్లు అమలు చేస్తాం అని రెండోసారి అధికారం లోకి వచ్చి పకోడీలు , బండ్లు వ్యాపారాలు , సిమ్స్ అమ్ముకోవడం కూడా ఉపాధి చూపడం అనడం సిగ్గు చేటన్నారు. జగన్ మోహన్ రెడ్డి అధికారం లోకి వచ్చి 4 సంవత్సరాలు అవుతున్నా రాష్ట్ర హక్కు ల కోసం మాట్లాడడం లేదని, ప్రత్యేక హెూదా వస్తే 90% నిధులు మంజూరు అవుతాయని తెలిపారు. ఈనెల 30వ తేదీ రాత్రికి బస్సు యాత్ర రాజమండ్రి చేరుకుంటుందని, యాత్రను విజయవంతం చేయాలని వారు కోరారు

ఉత్తమ సేవా పురస్కారం

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : కాకినాడ జిల్లాలో పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న ప్రత్తిపాడు బాలుర వసతి గృహ సంక్షేమ అధికారి ఎంఎస్ సత్య

నారాయణ సేవలను గుర్తించి జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్లా, జాయింట్ కలెక్టర్ ఇలాక్కియ, జిల్లా ఎస్పి రవీంద్ర బాబు ప్రశంసా పత్రంతో సత్కరించారు.

అంతర్వేది ఉత్సవ నిధులపై మున్సిపల్ గరం గరం
విపక్షానికి అవగాహన లేదని అధికార పక్షం విమర్శ

విశాలాంధ్ర - అమలాపురం : అమలాపురం పురపాలక సంఘ సాధారణ సమావేశం చైర్ పర్సన్ రెడ్డి నాగేంద్రమణి సత్యనారాయణ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన చర్చలలో భాగంగా ప్రముఖ అంతర్వేది శ్రీ

లక్ష్మీనరసింహస్వామి కళ్యాణ మహోత్సవాలకు అమలాపురం పురపాలక సంఘం నిధుల నుండి కొంత విడుదల చేసేందుకు అజెండాలో అంశాన్ని పొందుపరిచారు. ఈ అంశంపై జనసేన పార్టీ కౌన్సిలర్ తిక్కా సత్యలక్ష్మి మాట్లాడుతూ మున్సిపాలిటీలో నిధులు కోరుతూ ఉందని అలాంటప్పుడు దూరాన ఉన్న ఆలయంలో జరిగే కళ్యాణ మహోత్సవానికి నిధులు ఎలా కేటాయిస్తారని ఆమె అన్నారు. దీనిపై స్పందించిన వైసిపి పట్టణ పార్టీ అధ్యక్షుడు, పాలకపక్ష కౌన్సిలర్ సంసాని బుల్లినాని మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కోనసీమ జిల్లాలోని ప్రతి పంచాయతీల నుండి, పురపాలక సంఘం నుండి గత కొన్ని యేళ్లుగా చెల్లించడం జరిగిందని అన్నారు. సమావేశంలో సత్యలక్ష్మి నిధులు కేటాయింపు పై ఏమైనా జీవో ఉందా అది తనకు ఇవ్వాలని అధికారులను కోరారు. దీంతో వైసిపి పార్టీ కౌన్సిలర్ మట్టపర్తి నాగేంద్ర మండిపడ్డారు. జనసేన వైసిపి కౌన్సిలర్ల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. మట్టపర్తి నాగేంద్ర మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రసిద్ధమైన దేవాలయాల్లో అంతర్వేది దేవాలయం ఒకటని, నిధులు కేటాయించడం ఆనవాయితీగా వస్తుందని, అధికారులు ఎజెండాలో సరిగ్గా రాయకపోవటం వల్లే సభ్యులకు అనుమానాలు వచ్చాయని అన్నారు.

కార్పొరేట్ సంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్య

విశాలాంధ్ర - గండేపల్లి : పేద విద్యార్థులకు విద్యను అందించేందుకు కార్పొరేటర్ సంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలలో విద్యను అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని జగ్గంపేట శాసన సభ్యులు జ్యోతుల చంటిబాబు అన్నారు. గండేపల్లి

మండలంలో పదవ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్‌ను శాసనసభ్యులు జ్యోతుల చంటిబాబు, జెడ్పీటీసీ పరిమి వెంకటలక్ష్మి మంగతాయారు బాబు చేతుల మీదుగా విద్యార్థినీ విద్యార్థులకు పుస్తకాలు, స్టడీ మెటీరియల్స్ మల్లేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని మొత్తం 6 స్కూల్స్‌కు సంబంధించి పదవ తరగతి విద్యార్థులుకు 463 స్టడీ మెటీరియల్స్ అందించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చలగళ్ల దొరబాబు, గ్రామ సర్పంచ్ బలిరెడ్డి గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

వైరస్‌తో పందులు మృతి

విశాలాంధ్ర - మామిడికుదురు : మండల పరిధిలోని అప్పనపల్లి, కొమరాడ, దొడ్డవరం, పెదపట్నం లంక, పాశర్లపూడి, మామిడికుదురు తదితర గ్రామాల్లో వైరస్ బారిన పడిన పందులు ఎక్కడికక్కడే మృత్యువాత

పడుతున్నాయి. దీంతో వాటిని సంబంధిత పెంపకం దారులు నిర్లక్ష్యంగా గోదావరి, పంట కాలువలు, చెరువులు, రహదారి పక్కన వాటిని పడేసి చేతులు దులిపేసుకుంటున్నారు. పంది మృత కళేబరాలు కుళ్లిపోయి తీవ్ర దుర్గంధం వాటిల్లడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దుర్వాసన వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని భయాందోళన చెందుతున్నారు. పందులు సంచరించే ఆయా గ్రామాల్లో పంచాయతీ అధికారులు దృష్టి సారించాలని, మృత్యువాత పడిన వాటిని పూడ్చి పెట్టేలా చర్యలు తీసుకోవాలని, వెటర్నరీ అధికారులు స్పందించి వైరస్‌తో మృత్యువాత పడుతున్న వాటి మరణాలు అరికట్టేందుకు నివారణ చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ముఖ ఆధారిత హాజరును ప్రభుత్వం ఉపసంహరించుకోవాలి

విశాలాంధ్ర - సామర్లకోట : రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన ముఖ ఆధారిత హాజరును వెంటనే ఉపసంహరించుకోవాలని కోరుతూ సామర్లకోట పట్టణంలో మున్సిపల్ రెగ్యులర్

మరియు ఔట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) ఆధ్వర్యంలో రిపబ్లిక్ డే పురస్కరించుకుని మున్సిపల్ కార్యాలయం ఆవరణలో బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ పట్టణ కార్యదర్శి పెదిరెడ్ల సత్యనారాయణ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్ బి. శీను మాట్లాడుతూ ముఖ ఆధారిత హాజరును వెంటనే ప్రభుత్వం ఉపసంహరించుకోవాలన్నారు. ఈ విధానం వల్ల మునిసిపల్ కార్మికులతో పాటు ఇంజనీరింగ్ కార్మికులకు స్మార్ట్ ఫోన్ల ద్వారా ప్రతిరోజు నాలుగు సార్లు హాజరు తీసుకోవాల్సి ఉంటుందని స్మార్ట్ ఫోన్లు వాడకం తెలియని ఈ కార్మికులు ఎలా హాజరు అవుతారని అటువంటి వారిని తొలగించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకునే అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పార్టీ నాయకులు ఎలిశెట్టి రామదాసు,మడగల రమణ, కసింకోట ఆనందరావు, కసింకోట కిషోర్, మిరియాల పెద్ద, మల్లిపూడి లక్ష్మి, చింతల అజ్జమ్మ, చిరత వరలక్ష్మి, చింతల లోవరాజు, తాతపూడి శీను, ఏడుకొండలు, గూడుపు రవి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు

విశాలాంధ్ర - రాజానగరం : పేద,మధ్య,దిగువ తరగతి ప్రజలకు ఆర్థిక అభివృద్ధి అందించేందుకు తోడ్పాటు అందిస్తున్నామని డిఆర్డిఎ తూర్పుగోదావరి జిల్లా ప్రాజెక్టు మేనేజర్ (డిపిఎం) బి.హేమంత్ అన్నారు.

నియోజకవర్గ కేంద్రమైన రాజానగరం వెలుగు కార్యాలయంలో ఎపిఎం కె. హేమ నాగలక్ష్మి అధ్యక్షతన ఆహార ఉత్పత్తుల తయారీ శిక్షణ సమావేశం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డిపిఎం హేమంత్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం,ఏపీ ఫుడ్ ప్రోసెస్సింగ్ సోసైటీ(ఏపీఎఫ్పి ఎస్)సంయుక్తంగా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన శిక్షణ తరగతులకు లబ్ధిదారులు హాజరు కావాలని,తద్వారా ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవా లని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఫుడ్ ప్రోసెస్సింగ్ సోసైటీ ట్రైనర్ చరణ్,రాజానగరం, సీతానగరం,రంగంపేట, గోకవరం ఎపిఎంలు కె. హేమ నాగలక్ష్మి, మహాలక్ష్మి, డి.లక్ష్మీ,జి.సునీత,వివిధ గ్రామాల లబ్ధిదారులు పాల్గొన్నారు.

పుస్తకాలు అందజేత

విశాలాంధ్ర - దేవరపల్లి : దేవరపల్లి మండలం ఎర్నగూడెం బొల్లిన గంగరాజు జిల్లా పరిషత్ హై స్కూల్లో శుక్రవారం దేవరపల్లి మండలం గాంధీనగర్ గ్రామానికి చెందిన విద్యా దాత అభ్యుదయ రైతు పిన్నమనేని ఋషీ కేశవరావు విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్ పుస్తకాలను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పుస్తక రచయిత షేక్ అహ్మద్ భాషా, ప్రధాన ఉపాధ్యాయు రాలు శ్రీ వాసవి, స్కూల్ పూర్వ విద్యార్థి తిరుపతి చక్రవర్తి, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

విశాలాంధ్ర - చాగల్లు : యువజన సర్వీసుల శాఖ సెట్రాజ్ కాకినాడ వారి ఆధ్వర్యంలో మండల కేంద్రం చాగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం వ్యక్తిత్వ వికాసము, విద్యా ఉద్యోగ అవకాశ అంశాలపై విద్యార్థినీ విద్యార్థులకు

రిసోర్స్ పర్సన్ వీవీఎస్ఎస్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. వీరాజు మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థుల భవిష్యత్తుకు ఇదొక అద్భుతమైన కార్యక్రమమని గైడెన్స్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సెట్రెజ్ మేనేజర్ కేవీస్సీ కాశీ విశ్వేశ్వరరావు, యువజన సర్వీసుల శాఖ సూపర్ డెంటెంట్ సూర్యనారాయణ, ఫీల్డ్ ఆఫీసర్ కే గౌతమ్, విద్యార్థిని, విద్యార్థులు యువతీ యువకులు పాల్గొన్నారు.

శ్రీజితకు ఐదు ప్రతిభా అవార్డులు

విశాలాంధ్ర- నిడదవోలు: నిడదవోలుకు చెందిన శ్రీజిత ఐదు ప్రతిభ అవార్డులు సాధించినట్లు తల్లిదండ్రులు రామచంద్రరావు, శ్రీలక్ష్మి లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ ప్రభుత్వ దంత వైద్యశాలలో ఇంటర్న్ షిప్

చేస్తున్న నిడదవోలు పట్టణానికి చెందిన డాక్టర్ శ్రీజిత రిపబ్లిక్ డే సందర్భంగా ప్రభుత్వ దంత వైద్యశాల, హైదరాబాద్ అల్యూమినీ అసోషియేషన్ వారిచే 5 ప్రతిభ అవార్డులతో పాటుగా ప్రశంస పత్రాలు గోల్డ్ మెడల్స్ సాధించిందన్నారు.

ఎరువులు సీజ్

విశాలాంధ్ర బ్యూరో - రాజమహేంద్రవరం : విజిలెన్స్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎస్. బి. బాగ్చి ఆదేశాల మేరకు ఎస్.పి. పి.వి.రవి కుమార్ ఆధ్వర్యంలో విజిలెన్స్ అధికారులు, వ్యవసాయ శాఖ, లీగల్ మెట్రాలజి అధికారులతో కలిసి తూర్పు గోదావరి జిల్లాలోని బిక్కవోలు మండలం బలబద్రపురం గ్రామంలోని శ్రీ

మణికంఠ ఏజెన్సీస్ పురుగుల మందులు, ఎరువుల దుకాణాన్ని విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. షాపులో ఎరువులు గరిష్ట అమ్మకపు ధర కన్న ఎక్కువ ధరకు అమ్మకం చేయడంతో బిక్కవోలు మండల వ్యవసాయ అధికారి సుమారు రూ.18,122 విలువ గల 3.06 మెట్రిక్ టన్నుల ఎరువులను సీజ్ చేశారు. సదరు షాపులో సిఐఎల్ యూరియా గరిష్ట అమ్మకపు ధర రూ.266.50 వుండగా రూ. 290 లకు అమ్మకము చేయుట గుర్తించిన లీగల్ మెట్రాలజి అధికారులు కేసు నమోదు చేశారు. ఈ తనిఖీలలో డి. ఎస్.పి పి. ముత్యాలనాయుడు, కార్యాలయ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ అధికారి భార్గవ మహేష్, కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

రాష్ట్ర భవిష్యత్తు టీడీపీతోనే

విశాలాంధ్ర బ్యూరో - రాజమహేంద్రవరం : ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి నిరంకుశ పాలన కారణంగా రాష్ట్రాభివృద్ధి 20 ఏళ్లు వెనక్కి తీసుకెళ్లిపోయిందని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానీ శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు అన్నారు. స్థానిక

11వ డివిజన్లో టీడీపీ సీనియర్ నాయకులు కంటిపూడి రాజేంద్రప్రసాద్, పిల్లి తాతారావు తదితర టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో "ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి" కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానీ, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు హాజరై డివిజన్లోని ఇంటింటికీ వెళ్లి ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. టీడీపీ నగర అధ్యక్షులు రెడ్డి మణేశ్వరరావు నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి రాంబాబు, మైనారిటీ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ షేక్ సుభాన్, టిఎన్‌టియూసీ రాష్ట్ర కార్యదర్శి తీడా నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

జమున మృతికి ఎంపీ భరత్ సంతాపం

విశాలాంధ్ర బ్యూరో - రాజమహేంద్రవరం : ప్రముఖ తెలుగు చలనచిత్ర నటి, రాజమండ్రి మాజీ ఎంపీ జమున మృతిచెందడం పట్ల వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, రాజమండ్రి ఎంపీ మార్గాని భరత్ రామ్ తీవ్ర దిగ్భ్రాంతిని, ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. ఆమె నటన తెలుగు ప్రజల గుండెల్లో ఎప్పటికీ సజీవమేనని 1989లో రాజమండ్రి నుండి కాంగ్రెస్ ఎంపీగా విజయం సాధించి, రాజమండ్రి నగర వాసుల ఆడపడుచుగా మరచిపోలేని ముద్ర వేసుకున్నారని ఎంపీ మార్గాని భరత్ రామ్ పేర్కొన్నారు.

ఏలేశ్వరం ఎస్ఐగా సతీష్

విశాలాంధ్ర - ఏలేశ్వరం : ఏలేశ్వరం ఎస్ఐగా పనిచేస్తున్న సిహెచ్ విద్యాసాగర్ ఇటీవల బదిలీపై జగ్గంపేట వెళ్లడంతో ఆయన స్థానంలో జి. సతీష్ ఎస్ఐగా పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ సంఘ విద్రోహ చర్యలకు పాల్పడే

వారిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదన్నారు. తుని రూరల్ ఎస్సైగా పనిచేస్తూ బదిలీపై ఏలేశ్వరం వచ్చినట్లు ఆయన తెలిపారు.

ప్రమాద నివారణ చర్యలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలి

విశాలాంధ్ర - ఏలేశ్వరం : రోడ్డు ప్రమాద నివారణ చర్యలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఏలేశ్వరం ఎస్సై జి. సతీష్ పిలుపునిచ్చారు. ఈనెల 17వ తేదీ నుండి ఫిబ్రవరి 2 తేదీ వరకు ఏపీఎస్ఆర్టీసీ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శు

క్రవారం స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో డిపో మేనేజర్ ఎస్. బాపిరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు స్థానిక ఎస్ఐ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ వాహనాలపై ప్రయాణించేటప్పుడు భద్రత చర్యలు తప్పనిసరిగా పాటించాలన్నారు. డిపో మేనేజర్ మాట్లాడుతూ డ్రైవర్లు ప్రమాదాల పట్ల అప్రమత్తమై ఉండాలన్నారు. ఈ సదస్సులో డిపో కార్మికులు, డ్రైవర్లు, కండక్టర్లు పాల్గొన్నారు.

ప్రక్కిలంకలో భూమి రీసర్వే

విశాలాంధ్ర - తాళ్లపూడి : జగనన్న శాశ్వత భూరక్ష పథకంలో భాగంగా తాళ్లపూడి మండల రెవెన్యూ అధికారులు శ్రీకారం చుట్టారు. ప్రక్కిలంక గ్రామానికి చెందిన భూములను డ్రోన్ ద్వారా రీ సర్వే చేస్తున్నట్టు అధికారులు

తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ ఎస్‌సి సెల్ అధ్యక్షులు యళ్ల బాబురావు ,గ్రామ పంచాయతీ వైస్ ప్రెసిడెంట్ నాని, వార్డు మెంబెర్స్ సుమశ్రీ, రాజు ,వేణు, రవిశంకర్, విఆర్ఓ విజయకుమారి, జూనియర్ అసిస్టెంట్ దేవి, గ్రామ సర్వేయరు మణి కంఠ పాల్గొన్నారు.

అంబాజీపేటలో ముగ్గురికి ఉత్తమ సేవా పురస్కారాలు

విశాలాంధ్ర - అంబాజీపేట : 74వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా మండలంలో ముగ్గురికి సేవా పురస్కారాలు లభించాయి. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం కలెక్టరేట్లో జరిగిన రిపబ్లిక్ డే వేడుకలలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, అమలాపురం ఎంపి చింతా అనురాధల చేతుల మీదుగా అంబాజీపేట ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న ఎ. చైతన్యకుమార్, మాచవరం గ్రామ పంచాయతీ ఉద్యోగి పితాని రాంబాబు, డ్వామా పిడి మధుసూదన్ చేతుల మీదుగా డైరెక్ట్ బ్యాంక్ ట్రాన్స్ఫర్ మేనేజర్ (ఫుల్ అడిషనల్ ఛార్జ్)గా విధులు నిర్వహిస్తున్న అడపా వెంకట కృష్ణలు ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్నారు. వీరిని మండలానికి చెందిన అధికారులు, ప్రజాప్రతినిధులు, మండల ప్రజలు అభినందించారు.

ఉత్తమ సేవలకు తగిన గుర్తింపు

విశాలాంధ్ర - సీతానగరం: ఉత్తమ సేవలకు తగిన గుర్తింపు దక్కింది. సీతానగరం మండల ఎంపిడివోగా ప్రజలకు సేవలు అందిస్తున్న కె.రమేష్, మండల విద్యాధికారి స్వామి నాయక్ కు ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న మొక్కను ఇచ్చి

అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు వారధులుగా సేవలను అందిస్తున్న ఉద్యోగులకు ప్రజలకు అందిస్తున్న సేవలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి ప్రతీ సంవత్సరం గణతంత్ర దినోత్సవం నాడు జిల్లా కలెక్టర్ చేతులు మీదుగా ప్రశంసా పత్రాలు అందిస్తున్నారని అన్నారు. ఈ పురస్కారాలను అందుకున్న మండల ఉద్యోగులకు శుభాకాక్షలు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది కూడా మొక్కను ఇచ్చి ఎంపిడివో కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఓ గోపాల్, సీనియర్ అసస్టెంట్ శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ భరణి, టైపిస్ట్ సతీష్ మొదలగు అధికారులు పాల్గొన్నారు.

కలెక్టరు బంగ్లాలో ఘనంగా "ఎట్ హెూమ్"

విశాలాంధ్ర - ఏలూరు : గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ఎట్ హెూమ్ కార్యక్రమం వేడుకగా సాగింది. చక్కని ఆహ్లాదకర వాతావరణంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు జిల్లా అధికారులు కుటుంబ సభ్యులతో కలిసి కార్యక్రమానికి హాజరయ్యారు. వారిని జిల్లా కలెక్టర్ దంపతులు వె.ప్రసన్న వెంకటేష్, డాక్టర్ మానస, సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ కార్యక్రమాల్లో భాగంగా జిల్లా సహకార అధికారిణి టీ.ప్రవీణ సుమధుర వీణానాదం అందరిని అలరించింది.నృత్య కార్యక్రమాలు,హౌసీ, పాటల పోటీల కార్యక్రమాలు ఎంతో ఉల్లాసపరిచాయి. ఈ కార్యక్రమంలో ఎస్పీ రాహుల్ దేవ్ శర్మ, జిల్లా రెవిన్యూ అధికారి ఏ. వి.సత్యనారా యణ మూర్తి, ఎస్ఇబి జాయింట్ డైరెక్టర్ ఎస్.సూర్యచంద్ర రావు,సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్ర,ట్రైనీ కలెక్టర్ అపూర్వ భరత్ ,డి ఎఫ్ వో రవిచంద్ర ధామ,ఆర్డీఓ కె. పెంచల్ కిషోర్, పి ఆర్ ఎస్ ఈ చంద్ర భాస్కర్ రెడ్డి,డిఆర్డీఏ పీడీ ఆర్.విజయరాజు, జెడ్పి సి ఈ ఓ కె.రవికుమార్, సాంఘిక సంక్షేమ శాఖ జెడి మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

యువగళం విజయవంతానికి 400 కొబ్బరికాయలు కొట్టిన నాయకులు

విశాలాంధ్ర - పాలకొల్లు : నారా లోకేష్ చేపట్టిన యువగళం ప్రజా పాదయాత్ర విజయవంతం కావాలని కోరుతూ పాలకొల్లు పట్టణం శ్రీ క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయంలో టిడిపి బీసీ నాయకులు అంగర వీరభద్ర కుమార్ ఆధ్వర్యంలో 400 కొబ్బరికాయలు కొట్టి పాదయాత్ర విజయవంతంగా సాగాలని స్వామిని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులతోపాటు, టీడీపీ యలమంచిలి మండల అధ్యక్షులు మామిడిశెట్టి పెద్దిరాజు, పాలకొల్లు మండల అధ్యక్షులు కోడి విజయభాస్కరరావు, పోడూరు మండల టిడిపి అధ్యక్షులు గొట్టుముక్కల సూర్యనారాయణ రాజు, సమన్వయ కమిటీ సభ్యులు, తెలుగు యువత నాయకులు, పెద్ద సంఖ్యలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

విజయదుర్గ ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ట

విశాలాంధ్ర - నిడమర్రు : నిడమర్రు గ్రామంలో శ్రీ విజయ దుర్గ ఆలయం వద్ద ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమంలో ఉంగుటూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్ చార్జ్,శ్రీ లక్ష్మీనారాయణ ఫౌండేషన్ చైర్మన్ పత్సమట్ల ధర్మరాజుపాల్గొన్నారు. ఆయనతోపాటు జనసేన పార్టీ గ్రామ ఉపాధ్యక్షులు కొట్టే సాయి కృష్ణ , జనసేన నాయకులు చింతలపాటి బాసి రాజ, మైలవరపు సురేంద్ర, మీసాల హరిబాబు, గ్రామ జనసైనికులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన మహిళలు

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : మండలంలో వివిధ గ్రామాలకు చెందిన 22 మంది మహిళలు శుక్రవారం టీడీపీలో చేరారు. వీరికి టీడీపీ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యురాలు గంగిరెడ్ల మేఘలాదేవి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మేఘలాదేవి మాట్లాడుతూ రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీని అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో మహిళలు అన్ని విధాల అభివృద్ధి చెందాలంటే టిడిపి అధికారంలోకి రావాలన్నారు. మహిళలంతా తమ ఓటు రూపంలో గెలిపించడానికి కృషి చేయాలని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చెరుకూరి రమ్య, ఎస్. రంగమ్మ, కె.లక్ష్మి,డి.కుమారి, పి.శుభాషిణి, డి.ప్రభ, ఎన్. వెంకటలక్ష్మి, పి. మనీ, పి. లక్ష్మీ, వి .రాణి,బుజ్జమ్మ, నయోమి, జి. వెంకటలక్ష్మి, జానకి, స్వప్న, దుర్గమ్మ, రేష్మ, తదితర మహిళలు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల ఉత్తమ ప్రిన్సిపల్‌గా రాజారావు

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం రూరల్ : పెదతాడేపల్లిలోని అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ప్రిన్సిపల్‌గా విధులు నిర్వహిస్తున్న బి. రాజారావు గురువారం జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి చేతులు మీదుగా ఉత్తమ ప్రిన్సిపల్ అవార్డు అందుకున్నారు. గతంలో ప్రిన్సిపల్ రాజారావు ఉత్తమ ప్రిన్సిపల్‌గా 5 సార్లు ఉమ్మడి పశ్చిమగోదావరి కలెక్టర్ చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. గత సంవత్సరం టీచర్స్ డే సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ చేతులమీదుగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. విద్యార్థులకు క్రమశిక్షణ, మౌలిక వసతులు, క్రీడల్లో నైపుణ్యాభివృద్ధి, సాంకేతిక పరిజ్ఞానం, 10వ తరగతి ఫలితాలు సాధించడంలో చేసిన కృషి ఫలితంగా ఈ అవార్డు తనకు లభించిందని ప్రిన్సిపల్ రాజారావు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ రాజారావును గురుకుల పాఠశాలల జిల్లా కో ఆర్డినేటర్ వాసవి, తోటి ఉపాధ్యాయులు ప్రతాప్, గంగాభవాని, ఎం.వి.బాలాజీ, ఎస్. ఆనంద్, జ్యోతి, చంద్రకళ, టి. మధు, వై.రాకేష్, బలరామ్, వెంకటేశ్వరరావు, విద్యార్థులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, తదితరులు అభినందించారు.

అవార్డులు అందుకున్న మండల అధికారులు

విశాలాంధ్ర - బుట్టాయిగూడెం: గణతంత్ర దినోత్సవం సందర్భంగా మువ్వన్నెల త్రివర్ణ జెండా గురువారం మండలంలో రెపరెప లాడింది. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో 74వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని అధికారులు, ప్రజా ప్రతినిధులు జాతీయ జెండాను ఎగరవేసి గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ మేరకు మండలంలో వివిధ ప్రభుత్వ శాఖల్లో మెరుగైన పనితీరు కనబరచిన తహశీల్దార్ ఎస్.శార శాంతి, ఈఓపిఆర్డి ఎం. శ్రీహరి, మండల వ్యవసాయ అధికారిణి బి.సుమలత, దొరమామిడి పంచాయతీ సెక్రెటరీ ఎం. బుజ్జమ్మ, దొరమామిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆశ వర్కర్ తుంగ సుజాతలు ఏలూరు పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన సంబరాల్లో జిల్లా కలెక్టర్ వై ప్రసన్న వెంకటేష్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందుకున్నారు.

గృహ సారధుల నియామకం వేగవంతం చేయాలి

విశాలాంధ్ర - ముదినేపల్లి : వైసీపీ ప్రభుత్వానికి నూతన ఉత్తేజాన్ని నింపేందుకు గృహ సారధుల నియామకం తోడ్పడుతుందని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు పేర్కొన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం 150వ రోజున వడాలి గ్రామంలో జెడ్పీటీసీ ఈడే వెంకటేశ్వరమ్మ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ , పార్టీ నాయకులు ఈడే వెంకటేశ్వరరావు (చిన్నా) అధ్యక్షతన జరిగిన సభలో రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ మాదు శివరామకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వాలంటీర్లకు సహకారంగా పార్టీ గృహ సారధులు ఉంటారన్నారు. ఈ ప్రక్రియను ఈనెల 29 నాటికి పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కైకలూరు ఎంపీపీ అడవి కృష్ణ , మండవల్లి ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామ దుర్గాప్రసాద్ , రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఘంటా సంధ్య కోటేశ్వరరావు , వైస్ ఎంపీపీలు చొప్పర్ల సునీత, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

మండల పరిషత్ బడ్జెట్ ఆమోదం

- టీడీపీ, వైసీపీ అనుకూల సర్పంచులు, ఎంపీటీసీ మధ్య వాగ్వాదం
- గ్రామాల అభివృద్ధికి నిధుల లేమి
- సర్పంచుల ఆవేదన

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం రూరల్ : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి పొనుకుమాటి శేషులత అధ్యక్షతన 2023-24 సాధారణ అంచనాల బడ్జెట్ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా రూ.31 కోట్ల 6 లక్షల 65 వేల అంచానాల బడ్జెట్‌ను ఎంపిడిఓ కె.వెంకటేష్ ప్రవేశపెట్టగా ఎంపిటిసిలు ఆమోదం తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బిసిల అభివృద్ధికి 12 లక్షలు, గ్రామాల్లో నీటి సరఫరాకు రూ.8 లక్షల 50 వేలు, మహిళా శిశు సంక్షేమ ప్రజా ఆరోగ్యం రూ. 4 లక్షలు, పంచాయితీ రాజ్, రోడ్ల నిర్మాణం అభివృద్ధికి రూ.13 లక్షలు, ఉపాధి హామీ కార్యక్రమాల నిర్వహణకు రూ.21.10 కోట్లు, చెరువుల అభివృద్ధి, వీధి లైట్లు, తదితర అభివృద్ధి పనులకు అంచనాలతో కూడిన బడ్జెట్కు ఆమోదం లభించింది. అనంతరం జరిగిన బడ్జెట్ సమావేశంలో టిడిపికి చెందిన ఎంపిటిసిలు, అనుకూలంగా గెలుపొందిన సర్పంచ్‌లు పొనుకుమాటి గౌరి, పీతల బుచ్చిబాబు, పిల్లా రాంబాబు, హనుమంతు, తాడేపల్లి బేబి తదితరులు బడ్జెట్ సమావేశానికి సంబంధించిన సమాచారం తమకు రాలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రతీ సాధారణ సమావేశానికి ఇదే పరిస్థితి కొనసాగుతుందని గ్రామాల్లో కూడా వాలంటీర్లు తమకు తెలియకుండా అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్నారని వాపోయారు. సర్పంచ్ పరిస్థితి అధ్వాన్నంగా మారిందని తెలిపారు. రెండు రోజులు ముందు మాత్రమే తనకు సమావేశం ఉందని సమాచారం అందించడం ఆశ్చర్యం కలిగించిందని జగన్నాధపురం సర్పంచ్ పొనుకుమాటి గౌరీ వాపోయారు.దీనిపై స్పందించిన వైసిపి పార్టీకి చెందిన ఎంపిటిసిలు, అనుకూలంగా గెలిచిన సర్పంచ్లు, జెడ్పిటిసి ముత్యాల ఆంజనేయులు, వైస్ ఎంపిపిలు రామకృష్ణ, రంగబాబులు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో తహశీల్దార్ అప్పారావు కలుగజేసుకుని ఇరుపార్టీల ఎంపిటిసిలకు, సర్పంచ్లకు సర్దిచెప్పారు. ఇలాంటి సమస్య మరలా జరిగే మీటింగ్కు ఉండదని హామీ ఇవ్వడంతో వాగ్వాదం ముగిసింది. అనంతరం పరువురు సర్పంచ్లు, ఎంపిటిసిలు మాట్లాడుతూ గ్రామాల్లో త్రాగునీరు, డ్రైనేజీ, వీధి లైట్లు, పంచాయితీ రోడ్లు లాంటి సమస్యలు ఉన్నాయని వాటిని నిర్మించుకోలేని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ప్రభుత్వం, మండల స్థాయి అధికారులు స్పంచదించి నిధులు కేటాయించాలని కోరారు. దీనిపై స్పంచదించిన ఎంపిడిఓ వెంకటేష్ మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణను కలిసి గ్రామాల అభివృద్ధికి నిధులు వచ్చేలా కృషి చేస్తానని తెలిపారు. తహశీల్దార్ అప్పారావు మాట్లాడుతూ గ్రామాల్లో రైతులు ఈ క్రాఫ్ట్ నమోదు చేయించుకోవాలని, రేషన్ కార్డ్ దారులకు మార్పులు, చేర్పులు జరుగుతున్నాయని, పొలాలకు సంబంధించి పాస్ పుస్తకాల విషయంలో రెవిన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో అగ్రికల్చరలే ఎఓ,అర్.ఎస్.ప్రసాద్, రూరల్ ఎస్సై వీరభద్రరావు, ఆర్.డబ్ల్యూఎస్. పంచాయితీరాజ్, గృహనిర్మాణశాఖ, విద్యుత్‌శాఖ, విద్యాశాఖ, నీటిపారుదల శాఖ, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

యువగళంకు సంఘీభావంగా టీడీపీ ర్యాలీ

విశాలాంధ్ర -భీమవరం: నారా లోకేష్ యువగళం పాదయాత్ర టిడిపి శ్రేణులు భీమవరంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించాయి. ఈ సందర్భంగా మావుళ్ళమ్మ దేవాలయంలో చెరుకుపల్లి సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో 108 కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలుచేశారు. అనంతరం వీరమ్మచెరువు పార్క్ వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ర్యాలీలో పాల్గొన్న టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి మాట్లాడుతూ టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కుప్పంలో ప్రారంభించిన యువగళం పాదయాత్రకు విజయవంతం కావడానికి శ్రేణులు శక్తివంచన లేకుండా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో టిడిపి అంగన్వాడి డ్వాక్రా సంఘాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెరగాని నారాయణమ్మ, జిల్లా ఉపాధ్యక్షుడు మామిడిశెట్టి ప్రసాద్, మద్దుల రాము, రేవు వెంకన్న, కౌరు పృథ్వి శంకర్, బొడ్డు మోహన్, తమ్మినిడి నాగేశ్వరరావు, సయ్యద్ నశిమా, బేగం ఎండి షబీనా, గునుపూడి తిరుపాల్, మైలబత్తుల ఐజాక్ బాబు, ఎద్దు ఏసుపాదం తదితరులు పాల్గొన్నారు.

యువగళం విజయవంతానికి ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-టి.నరసాపురం : తెలుగు దేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పేరుతో చేపట్టిన పాదయాత్ర విజయవంతం కావాలని టిడిపి మండల అధ్యక్షుడు నాయుడు రామకృష్ణారావు గౌడ్ కోరారు. మండల తెలుగు దేశం పార్టీ ఆధ్వర్యంలో స్థానిక కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అబివృద్ధి, భవిష్యత్తు దృష్ట్యా నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర 400రోజులు పాటు 4వేల కిలోమీటర్ల సాగే పాదయాత్ర విజయవంతం కావాలని ఆయన ఆకాంక్షించారు. పాదయాత్ర కు అన్ని అడ్డంకులు తొలగాలని ప్రత్యేక పూజలు నిర్వహించి నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మాజీ జెడ్పీటీసీ సభ్యులు నల్లూరి చలపతిరావు, ఆచంట సూర్యనారాయణ, భీమవరపు జగన్మోహన రావు, ఆచంట అనిల్ కుమార్, పెద్దిన సత్యనారాయణ, కొల్లి రమేష్, దేవరపల్లి రంగారావు, గండబోయిన వెంకట్రావు, పాపాచార్యులు వీరేశలింగం తదితరులు పాల్గొన్నారు.

కలిదిండిలో : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి యువ నాయకులు నారా. లోకేష్ చేపట్టిన యువగళం జయప్రదం కావాలని టిడిపి పార్టీ నాయకులు పూజలు చేశారు. శుక్రవారం స్థానిక శ్రీ అభయాంజనేయ స్వామి వారి ఆలయంలో మండల పార్టీ అధ్యక్షులు పోకల. జోగిరాజు ఆధ్వర్యంలో స్వామి వారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువ నాయకుడు లోకేష్ 400 రోజులు 4000 కిలోమీటర్లు పాదయాత్రలో యువత, పార్టీ నాయకులు పాల్గొని విజయ వంతం చేయాలని కోరారు. అనంతరం యువగళం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి నున్న. రమాదేవి మాజీ ఏఎంసీ చైర్మన్ వల్లభనేని. శ్రీనివాస చౌదరి, లంక. రత్తయ్య వెంకటాపురం ఎస్ఆర్పి అగ్రహారం సర్పంచులు గూడవల్లి. శ్రీనివాసరావు, పరసా. వెంకటస్వామి, ముద్దం. భోగేశ్వర రావు, టిడిపి పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ విమర్శలు అర్ధరహితం

విశాలాంధ్ర - పాలకొల్లు : లోకేష్ పాదయాత్ర అడ్డుకునేందుకు వైసిపి తీవ్ర ప్రయత్నం చేస్తోందని టిడిపి నేతలు చేస్తున్న విమర్శను డిసిఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ తీవ్రంగా విమర్శించారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. జయంతికి, వర్ధంతికి తేడా తెలియని లోకేష్ పాదయాత్ర చేస్తున్నారంటే ఒక జోకర్ కు ఇచ్చే విలువ ప్రజలు ఇస్తున్నారని చెప్పారు.ఆయన పాదయాత్ర గురించి ప్రజలకు ఆసక్తి లేదని అతను కనీసం ఎమ్మెల్యే కూడా విజయం సాధించలేదని అటువంటి వ్యక్తిని తాము ఎందుకు అడ్డుకుంటామని ప్రశ్నించారు. విలేకర్ల సమావేశంలో జోగాడ ఉమామహేశ్వరరావు, బెజ్జవరపు నాగరాజు, జోగి వడ్డి కాసులు, చెన్ను విజయ్, గంటా నరేష్ తదితరులు పాల్గొన్నారు.

గృహప్రవేశానికి హాజరైన ప్రముఖులు

విశాలాంధ్ర - జంగారెడ్డిగూడెం : వైసీపీ నాయకులు బొల్లిన వెంకటేశ్వరరావు (బి.వి. ఆర్.చౌదరి) నూతన గృహ ప్రవేశ కార్యక్రమం ఏలూరు రోడ్డులోని మానస సరోవర్ విల్లాస్‌లో శుక్రవారం జరిగింది . ఈ కార్యక్రమానికి రాష్ట్రం లోని పలు జిల్లాల నుండి ప్రజా ప్రతినిధులు, వైసీపీ నాయకులు,అధికారులు అధిక సంఖ్యలో విచ్చేశారు. బీవీఆర్ చౌదరి వైసీపీ ఆవిర్భావం నుండి కీలక నాయకుడిగా ఉన్నారు.ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి సన్నిహితుడిగా, టి. టి. డి. బోర్డ్ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి అనుచరుడిగా బీవీఆర్‌కు రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ ముఖ్య నాయకులతో సత్సంబంధా లున్నాయి.ఈ గృహ ప్రవేశ కార్యక్రమానికి రాజ్య సభ సభ్యులు,మాజీ మంత్రి పిల్లి సుభాష్ చంద్రబోస్,ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ బాబు,చింతలపూడి ఎమ్మెల్యే వి.ఆర్.ఎలిజా ,ప్రత్తిపాడు ఎమ్మెల్యే పూర్ణ చంద్ర ప్రసాద్,ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు,రాజా నగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఆయన సోదరుడు గణేష్ పలువురు సర్పంచ్ లు,వైసీపీ నాయకులు,పోలీస్ అధికారులు,పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమానికి విచ్చేశారు.

జమున మృతికి నల్లమిల్లి సంతాపం

విశాలాంధ్ర - అనపర్తి : అలనాటి ప్రముఖ సినీ నటి, ఫిలింఫేర్ అవార్డు గ్రహీత, మాజీ ఎంపీ జమున మృతి పట్ల రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. శుక్రవారం రామవరంలో నల్లమిల్లి మాట్లాడుతూ తెలుగు చిత్ర సీమలో విభిన్నమైన పాత్రలు పోషించడమే గాక రాజమహేంద్రవరం ఎంపీగా ప్రజలకు ఆమె సేవలందించారని అన్నారు. 2010 లో రామవరం లోని నల్లమిల్లి మూలారెడ్డి కళాపరిషత్ వేడుకల్లో ఆమె పాల్గొన్న విషయాన్ని గుర్తు చేసుకున్నారు. ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు రామకృష్ణారెడ్డి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

తార బలముల క్యాలెండర్ అవిష్కరణ

విశాలాంధ్ర - నిడదవోలు : తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీకోటసత్తెమ్మ దేవస్థానం లో శుక్రవారం నిడదవోలు శాసన సభ్యులు జి. శ్రీనివాస్ నాయుడు 2022-23 తార బలముల క్యాలెండర్ ను ఆవిష్కరించారు.ముందుగా అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు.అనంతరం శాశ్వత ,నిత్య అభి షేకం తారా బలముల క్యాలెండర్ అవిష్క రించా రని ఆలయ కార్యనిర్వాహణాధికారి బళ్ల నీలకంఠం(శివ)ఈ కార్యక్రమంలో ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ అండ్ చైర్మన్, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

యువగళం విజయవంతం చేయండి

విశాలాంధ్ర - కాకినాడ : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పేరుతో చేపడుతున్న పాదయాత్రను విజయవంతం చేయాలని టిడిపి రాష్ట్ర ఆరోగ్య విభాగ కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలోనే యువతకు భరోసా ఇచ్చేందుకు 2024 సార్వత్రిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పాదయాత్ర ప్రారంభం అయ్యిందన్నారు. 125కు పైగా నియోజకవర్గాల్లో కొనసాగుతుందన్నారు. వైసిపి ప్రభుత్వం దురాగతాలను అంతమొందిం చేందుకు, ప్రజా వ్యతిరేక పాలనకు వ్యతిరేకంగా ఈ పాదయాత్ర కొనసాగుతుందన్నారు.

7,8 డివిజన్లలో గడపగడపకు మన ప్రభుత్వం

విశాలాంధ్ర - కాకినాడ : 7, 8వ డివిజన్ల పరిధిలోని కొత్త కాకినాడ ప్రాంతంలో గురువారం సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహిం చారు. ఇంటింటికి వెళ్ళి ప్రజా సమస్యలు తెలుసుకుంటూ మూడున్నరేళ్ళ పాలనలో ప్రభుత్వం అందించిన నవరత్న పథకాలను ప్రజలకు వివరించారు. కౌడ ఛైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తికుమార్, వైఎస్సార్‌సీపీ నగరాధ్యక్షురాలు, మాజీ మేయర్ సుంకర శివప్రసన్నసాగర్, కమిషనర్ కే రమేష్, అదనపు కమిషనర్ సిహెచ్ నాగ నరసింహారావు పలువురు అధికారులు, మాజీ కార్పొరేటర్లు ఆయన వెంట ఉన్నారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వాటిని సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సచివాలయ, వాలంటరీ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తూ పారదర్శక పాలన అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్లు పసుపులేటి వెంకటలక్ష్మి, మీసాల ఉదయ్ కుమార్, మాజీ కార్పొరేటర్లు చిట్నీడి మూర్తి, సంగాని నందం, రోకళ్ళ సత్యనారాయణ, శిగల మధు, స్థానిక నాయకులు తొంపల తాతారావు, బత్తిన రాజు, నందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల పిల్లలకు సాయం

విశాలాంధ్ర - వేలేరుపాడు : మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలలో చదువుకుంటున్న 1000 మంది విద్యార్థిని విద్యార్థు లకు గ్రేస్ సర్వీస్ సొసైటీ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం సాయం అందించారు. తెలంగాణలోని ఖమ్మం జిల్లాకు చెందిన ఆ సంస్థ రుద్రంకోట, వేలేరుపాడు హై స్కూల్, శివకాశిపురం ఆశ్రం పాఠశాల, భూదేవిపేట కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల, ,వసంతవడ, రేపాకగొమ్ము తదితర మండలంలోని ప్రభుత్వ స్కూల్ లో దుప్పట్లు, నిత్యవసర సరుకులు, గిఫ్ట్ పాకెట్స్, తినుబండారాలు, బొమ్మలను ప్రజా ప్రతినిధులు, పాఠశాల విద్యాకమిటీ ఆధ్వర్యంలో పిల్లలకు అందించారు. ప్రతి విద్యార్థి పట్టుదలతో చదువుకుని తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు ఆ గ్రామానికి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు.గ్రేస్ సర్వీస్ సొసైటీ సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, రమేష్, మురళీకృష్ణరెడ్డి, సైదులు, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

యువగళం విజయవంతానికి ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర విజయవంతం కావాలని కోరుతూ కొయ్యల గూడెం పట్టణంలో మండల, పట్టణ నాయకుల ఆధ్వర్యంలో వినాయకుని ఆలయం వద్ద నుండి ర్యాలీగా బయలుదేరి చింతాలమ్మ ఆలయం, మసీదు,జిడిఎం చర్చ్ లలో సర్వమత ప్రార్థనలు చేయించారు. ఈ కార్యక్రమంలో పోలవరం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పారేపల్లి రామారావు, మండల ఉపాధ్యక్షుడు నిమ్మగడ్డ రవీంద్రనాథ్, పట్టణ అధ్యక్షుడు జేష్ఠ రామకృష్ణ, రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ సభ్యురాలు గంగిరెడ్ల మేఘలాదేవి, పారేపల్లి నరేష్, రాచూరి మదన్, నల్లూరు గోపి, బెల్లాన శ్రీను, తంకట రమేష్, బొబ్బర రాజు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

జీ తెలుగులో 29 నుంచి సరిగమప సింగింగ్ షో

విశాలాంధ్ర -భీమవరం : సరికొత్త సీజన్ సరిగమప ఛాంపియన్షిప్ ను తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నట్టు జీ తెలుగు చీఫ్ కంటెంట్ ఆఫీసర్ ఆఫ్ తెలుగు క్లస్టర్ అనురాధ గూడూరు చెప్పారు. ఈ నెల 29వ తేదీ ఆదివారం నుంచి ప్రతీ ఆదివారం జీ తెలుగు లో సరిగమప ప్రసారం కానుందన్నారు.తెలుగులో సూపర్ సక్సెస్ ఫుల్ గా కొనసాగుతున్న సింగింగ్ షో సరిగమప' ప్రేక్షకులను అలరించి బాగా పాపులర్ అయిన గాయకుల మధ్యే పోటీ పెట్టి ఛాంపియన్స్ లో ఛాంపియన్ ఎవరో గుర్తించే కాన్సెప్ట్ తో ప్రారంభమైందన్నారు. గత దశాబ్దన్నర కాలంలో స రి గ మ ప విజయవంతంగా లక్షలాది మందికి స్ఫూర్తినిచ్చే అద్భుతమైన అవకాశాన్ని సృష్టించిందన్నారు. 2022లో సరిగమప ది సింగింగ్ సూపర్‌స్టార్ సూపర్ సక్సెస్ తో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వ్యాప్తంగా అశేష అభిమానులను ఆకట్టుకుందన్నారు. అందుకే తెలుగు ప్రేక్షకులను అలరించేందుకు తెలుగు రాష్ట్రాల్లోని ప్రతిభావంతులైన వ్యక్తులకు వారి ప్రతిభను మరోసారి ప్రదర్శించడానికి ఒక వేదికను అందించడానికి స రి గ మ ప ఛాంపియన్‌షిప్ ప్రత్యేకమైన ఎడిషన్‌తో వచ్చామని చెప్పారు.

ఉత్తమ ఆరోగ్యంపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర - కాకినాడ : స్థానిక జెఎన్‌టియుకె సెనేట్ హాలులో శుక్రవారం స్కూల్ ఆఫ్ బయోటెక్నాలజీ, స్కూల్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ విభాగాల ఆధ్వర్యంలో 'మెటబోలోమిక్స్-ఏ న్యూ హారిజన్ ఫర్ బెటర్ హెల్త్' అనే అంశంపై గెస్ట్ లెక్చర్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అమెరికాలోని న్యూయార్క్ నుండి డాక్టర్ శ్రీనివాసరావు విచ్చేశారు. విశిష్ట అతిథులుగా జెఎన్‌టియుకె మాజీ ఉపకులపతి ప్రొఫెసర్ అల్లం అప్పారావు, రెక్టార్ కేవీ రమణ, ఐఎస్‌టి డైరెక్టర్ ఎ. గోపాలకృష్ణ హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి స్కూల్ ఆఫ్ బయో టెక్నాలజీ & స్కూల్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ విభాగాధిపతి ప్రొ.ఎం. రమేష్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ 100 మిలియన్‌ల మెటాబోలైట్స్ ద్వారా మానవుని ఆరోగ్యం అద్భుతాలు సృష్టించవచ్చు నన్నారు. ఆయుర్వేదం ప్రాచీన భారతదేశంలో ఉద్భవించిందని, ఆరోగ్యం, శ్రేయస్సు, మనస్సు, శరీరం,ఆత్మ మధ్య సున్నితమైన సమతుల్యతపై ఆధారపడి ఉంటుందన్నారు. ఇది ఆహారం, జీవనశైలి మార్పులు మరియు మూలికా నివారణల ద్వారా శరీరంలోని సమతుల్యతను కాపాడుకోవడంపై దృష్టి పెడుతుందన్నారు. అల్లం అప్పారావు మాట్లాడుతూ సిద్ధాంతం, ప్రయోగాలు, నూతన కంప్యూటింగ్ పద్ధతులతో పాటు పరిశోధనలు చాలా ముఖ్యమన్నారు. వ్యాధికి మెరుగైన చికిత్సలు, ఆరోగ్యకరమైన జీవితంపై మంచి అవగాహన కల్పించడం ద్వారా విద్యార్థులను చైతన్యపరిచారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ అడ్మిషన్స్ కె. పద్మరాజు, స్పెషల్ ఆఫీసర్‌లు జివిఎస్ఆర్ దీక్షితులు, ఏఎస్ఎన్ చక్రవర్తి, స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ జి శ్యామ్‌కుమార్, మాజీ డిఎంఈ కె బాబ్జి, ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డా నరసింహం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీచైతన్యలో ఘనంగా గణతంత్ర వేడుకలు

విశాలాంధ్ర- ఏలూరు : స్థానిక శాంతినగర్ శ్రీచైతన్య పాఠశాలలో 74వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన 'స్పోర్ట్స్ మీట్' ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా విచ్చేసిన సిఐ కె.వి.ఎస్.వి. ప్రసాద్ జెండా ఆవిష్కరణ చేసి విద్యార్థులచే ప్రత్యేక గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎందరో అమరవీరుల త్యాగఫలం మన స్వేచ్ఛా సంబరాలకు కారణమని, నేటి విద్యార్థులే రేపటి తరాల భవిష్యత్తును, అభివృద్ధిని నిర్ణయించే దిశగా తమ పయనం,గమ్యం ఉండాలని అన్నారు.పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శివకుమారి మాట్లాడుతూ నేడు భారతదేశ విధివిధానాలను, గణతంత్ర పరిపాలనను అనేక ప్రపంచ దేశాలు సైతం ఆదర్శంగా తీసుకున్నాయన్నారు. అనంతరం 'స్పోర్ట్స్ మీట్'నందు అనేక పోటీలలో విజేతలుగా నిలిచిన చిన్నారులకు ముఖ్య అతిథి చేతుల మీదుగా బహుమతి ప్రదానోత్సవం జరిగింది. ఈ సందర్భంగా చిన్నారులు నిర్వహించిన కరాటే విన్యాసాలు, దేశభక్తి గీతాల నృత్యం, యోగా పిరమిడ్, డంబెన్స్ ప్రదర్శన, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు, విచిత్ర వేషధారణలు అద్యంతం అలరించాయి.సభలో శ్రీ చైతన్య విద్యాసంస్థల రీజనల్ ఇంచార్జ్ సుంకర పార్థసారథి, రీజనల్ ఎకడమిక్ కోఆర్డినేటర్ సిహెచ్. ఉదయభాస్కర్, జోనల్ ఎకడమిక్ డీన్ జాల సంజీవ్ కుమార్, ప్రైమరీ ఇంచార్జ్ నరీనా ప్రీ- ప్రైమరీఇంచార్జ్ షబానా, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రైతులు పురుగుమందుల వాడకం తగ్గించాలి

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం రూరల్ : గ్రామాల్లో రైతులు వరిపొలాల్లో పురుగుమందుల వాడకం తగ్గించాలని మండల వ్యవసాయ అధికారి ఆర్.ఎస్. ప్రసాద్ సూచించారు. శుక్రవారం కృష్ణాయపాలెం గ్రామంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ అధిక దిగుబడుల కోసం నాట్లు వేసిన దగ్గరనుంచి కాంప్లెక్స్ ఎరువులు, పురుగుమందులు ఎక్కువగా వాడటం ద్వారా రైతులు నష్టపోవడంతోపాటు వరిలో మొవ్వ తెగులు వచ్చే అవకాశం ఉందన్నారు. వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలమేరకే పురుగుమందులు వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు రామకృష్ణ, రైతు భరోసా కేంద్రం ఛైర్మన్ గంగాధర్, ఉప సర్పంచ్ బేతపూడి వెంకటేశ్వరరావు, అగ్రికల్చరల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వితరణతో బాలికకు సైకిల్ పంపిణీ

విశాలాంధ్ర- జంగారెడ్డిగూడెం : స్థానిక నాల్గవ వార్డులోని ఇందిరానగర్ కాలనీ లో వారధి ట్రస్ట్ వ్యవస్థాపకులు వలవల తాతాజీ నిర్వహణలో పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఆరవ తరగతి చదువుతున్న షేక్ రజియా కు పట్టణానికి చెందిన మండవెల్లి రాంబాబు వ్యక్తిగత వితరణతో శుక్రవారం సైకిల్ పంపిణీ చేశారు.వారధి ట్రస్ట్ సేవా కార్యక్రమంలో భాగంగా దాత మండవెల్లి రాంబాబు కుమార్తె దర్శిని పుట్టినరోజు సందర్భంగా వారి చేతుల మీదుగా పంపిణీ చేసిన తెలుపుతూ దాతకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.నాగేశ్వర కుమార్,బసవరాజు వేణు,మద్దిపాటి శ్రీను,తియ్యాల ప్రసాద్,కంబాల పండు, షేక్ సిరాజ్, ఆఫీస్, ప్రసాద్,కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సివి రామన్ విద్యార్థినికి రిపబ్లిక్ డే వేడుకల్లో అవార్డు

విశాలాంధ్ర - అమలాపురం : రిపబ్లిక్ డే సందర్భంగా జరిగిన ఉత్సవాల్లో భాగంగా కలెక్టర్ కార్యాలయం క్యాంపస్‌లో జరిగిన కార్యక్రమాల్లో భాగంగా సర్ సివి రామన్ స్కూల్ విద్యార్థి ఆర్. దుర్గాదేవి చేసిన శాస్త్రీయ నృత్య ప్రదర్శనకు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎమ్మెల్యేలు, ఎంపీలు, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, ఎంపీ అనురాధ, ఎస్పీ సుధీర్ కుమార్ రెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి ఎన్ రవిసాగర్ అభినందించి షీల్డ్ అందజేశారు. ఈ బాలికను సర్ సివి రామన్ స్కూల్ డైరెక్టర్ ఆర్ వేణుగోపాల్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ కె పెద్దిరాజు, సత్య కుమార్ అభినందించారు.

జనసేన కార్యాలయం ప్రారంభం

విశాలాంధ్ర - సీతానగరం/కోరుకొండ: రాజానగరం నియోజకవర్గం కోరుకొండ మండ లంలో నూతనంగా జనసేన పార్టీ కార్యాలయాన్ని బత్తుల వెంకటలక్ష్మి బలరామకృష్ణ ప్రారంభించారు. రాబోయే ఎన్నికల్లో జనసేన విజయ ఢంకా మోగించడానికి మహా చెండీ నామకరణంతో ప్రచార రథం అందుబాటులోకి తీసుకు వచ్చారు. . ఈ సందర్భంగా బత్తుల వెంకటలక్ష్మి బలరామకృష్ణ విలేకరులతో మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో రాజానగరం నియోజకవర్గంలో రాష్ట్రంలో మొదటి జనసేన గెలుపొందిన నియోజకవర్గం అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కిమిడి శ్రీరామ్, శివరాం, మట్ట వెంకటేశ్వరరావు, నాగారపు సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇన్నోవా క్రిస్టా బుకింగ్స్ ప్రారంభం

విశాలాంధ్ర-రాజమండ్రి : టయోటా కిర్లోస్కర్ మోటర్ (టీకెఎం)నేడు తమ నూతన ఇన్నోవా క్రిస్టా కోసం బుకింగ్స్‌ను ప్రారంభించింది. 2005లో ఇన్నోవాను పరిచయం చేసిన నాటి నుంచి ఈ వాహనం భారతీయ మార్కెట్‌లో ఇంటి పేరుగా మారిపోయిందని టయోటా కిర్లోస్కర్ మోటర్ సేల్స్ అండ్ స్ట్రాటజిక్ మార్కెటింగ్ వైస్ ప్రెసిడెంట్ అతుల్ సూద్ చెప్పారు. దీనియొక్క సౌకర్యం, భద్రత, విశ్వసనీయత, విలాసం శక్తి పరంగా ఇది ప్రశంసనలను పొందిందన్నారు. ఈ నూతన ఇన్నోవా క్రిస్టా ఇప్పుడు వృద్ధి చేయబడిన ఫ్రంట్ ఫాసియాతో వస్తుందని, దీనిని రగ్డ్ ధృఢమైన ప్రదర్శనను దృష్టిలో ఉంచుకుని తీర్చిదిద్దారన్నారు. తద్వారా భారతీయ కుటుంబాలు, వ్యాపారవేత్తలు, కార్పోరేట్స్ మరియు ఫ్లీట్ యజమానుల అవసరా లను తీర్చనుందన్నారు. ఇన్నోవా క్రిస్టా బుకింగ్స్ కి అసాధారణ స్పందన లభించిందని చెప్పారు .